సొంతింటి కల చేరువై.. భారమైంది

- మేమేమి తప్పు చేశాము చంద్రన్నా?
- లబోదిబోమంటున్న అసంపూర్తి ఇళ్ల నిర్మాణ లబ్ధిదారులు


తాళ్లకోడులోని 74 ఎకరాల నిరుపేదల కాలనీలో నిర్మాణం పూర్తి కాని ఉన్న ఇళ్లు

ఆకివీడు: నిరుపేద కుటుంబంలో జన్మించి సొంతింటి కల నెరవేరదునుకున్న తరుణంలో వైఎస్సార్ సీపీ అధినేత వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి పేదల కల నెరవేర్చేందుకు ఇళ్ల స్థలాలను మంజూరు చేసి, పట్టాలు అందజేశారు. సొంతింటి కల కల చేరువై ఇళ్లు నిర్మించుకుందామనుకున్న పేదలకు రూ.1.80 లక్షలు, డ్వాక్రా రుణాలు అందజేశారు. అయితే కొంతమంది ఇళ్ల నిర్మాణానికి ముందుకు వచ్చి ఆయా కాలనీల్లోనూ, సొంత స్థలాల్లో ఇల్లు నిర్మించుకున్నారు. నియోజకవర్గంలో పేదల ఇళ్లు నిర్మించుకునేందుకు ప్రభుత్వం 9,421 మంది లబ్ధిదారులకు ఇళ్ల స్థల పట్టాలు ఇచ్చి రూ.1.80 లక్షల సొమ్ము మంజూరుకు ఎంపిక చేసింది. దీనిలో లబ్ధిదారులు అధిక శాతం మంది 4,309 మంది సొంతింటి కలను నెరవేర్చుకొని గృహ ప్రవేశాలు చేశారు. మరి కొంతమంది ఇళ్ల నిర్మాణం పూర్తి చేసి త్వరలో గృహ ప్రవేశానికి సిద్ధమవుతున్నారు. మిగిలిన 5,112 మంది లబ్ధిదారుల ఇళ్లు పలు దశల్లో అసంపూర్తిగా ఉన్నాయి. వీటిలో అధిక శాతం పునాది దశలోనే ఉన్నాయి. నిరుపేదలు పునాదుల తోనే ఇళ్ల నిర్మాణాన్ని నిలుపుదల చేశారు. ఇల్లు నిర్మించుకునేందుకు తగిన స్తోమత లేకపోవడంతో పునాదులు వేసి నిర్మాణాలను నిలుపుదల చేశారు. అప్పు పుట్టక, ఆర్థిక స్తోమత లేక నిరుపేదకు సొంతింటి కల కలగానే మిగిలింది.

నియోజకవర్గంలో అసంపూర్తి ఇళ్ల నిర్మాణాలు

ఆకివీడు	2080
ఉండి	1437
కాళ్ల	204
పాలకోడేరు	1391

కొత్త రుణాలు మాకూ ఇవ్వాలి

పునాదులు వేసి, అసంపూర్తిగా ఉన్న ఇళ్లకు రూ.4 లక్షలు రుణాలు అందజేయాలని పలువురు కోరుతున్నారు. ప్రభుత్వం ఆదుకోకపోతే పునాదులతోనే మా ఆశలు నిలిచిపోతాయని పలువురు వాపోతున్నారు. వివిధ దశల్లో ఉన్న లబ్ధిదారుల ఇళ్లకు ఆయా దశల్లో రుణ సహాయం చేయాలని పలువురు కోరుతున్నారు. కొత్త ప్రభుత్వం కొత్త నిబంధనలతో తమ సొంతింటి కల కలగానే మిగిలిపోతుందని వారు వాపోతున్నారు.

అసంపూర్తి ఇళ్లకు కూడా సహాయం చేయాలి



ఇళ్ల స్థలాల కోసం ఎప్పటి నుంచో ఎదురు చూస్తున్నాం. జగనన్న ప్రభుత్వంలో ఇళ్ల స్థలం ఇచ్చారు. రూ.1.80లక్షలు సహాయంచేశారు. అయితే ఆసహాయంతో ఇళ్ల నిర్మాణం పూర్తి కాలేదు. కొత్త ప్రభుత్వం మమ్మల్ని ఆదుకుని ఇళ్ల నిర్మాణానికి పూర్తిగా సహకరించాలి. లేకుంటే అసంపూర్తి నిర్మాణాలతోనే ఉండిపోతాయి.

– ఆవుల కుమారి, లబ్ధిదారు, ఆకివీడు

నేడు తణుకులో సీపీఐ జిల్లా సర్వసభ్య సమావేశం

భీమవరం: తణుకు పట్టణంలోని వంకా సత్యనారాయణ సురాజ్య భవనంలో ఈనెల 2వ తేదిన సీపీఐ జిల్లా సమితి విస్తృత సర్వసభ్య సమావేశం నిర్వహిస్తున్నట్లు ఆపార్టీ జిల్లా కార్యదర్శి కోనాల భీమారావు గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. శుక్రవారం ఉదయం 10 గంటలకు ప్రారంభమయ్యే సమావేశానికి పార్టీ శాఖా కార్యదర్శులు, సభ్యులు, సానుభూతి పరులు, ప్రజాసంఘాల సభ్యులు హాజరు కావాలని కోరారు. అలాగే మధ్యాహ్నం 2 గంటలకు పార్టీ జిల్లా కార్యవర్గం, సాయంత్రం 4 గంటలకు పార్టీ జిల్లా సమితి సమావేశం జరుగుతుందని సమావేశాల్లో సిపిఐ రాష్ట్ర సహాయ కార్యదర్శి ముప్పాళ్ళ నాగేశ్వరరావు, జాతీయ కార్యవర్గ సభ్యురాలు అక్కినేని వనజ, రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యులు డేగా ప్రభాకర్ పాల్గొంటారని భీమారావు తెలిపారు.

విద్యుత్ సరఫరాకు అంతరాయం

భీమవరం అర్బన్: మండలంలోని గొల్లవానితిప్ప విద్యుత్ ఉప కేంద్ర పరిధిలో శుక్రవారం 11 కేవీ విద్యుత్ హైటెన్షన్ వైర్లపై చెట్లు, కొమ్మలు తొలగించుట, వార్షిక మరమ్మతులు నిమిత్తం దిరుసుమర్రులోని ఇండస్ట్రీయల్ లైన్లకు ఉదయం 8 నుంచి 12 గంటల వరకు విద్యుత్ సరఫరా నిలిపివేస్తున్నట్లు ట్రాన్స్‌కో ఎగ్జిక్యూటివ్ అధికారి పీర్ అహ్మద్‌ఖాన్ గురువారం ఒక ప్రకటనలో తెలిపారు.

క్లుప్తంగా

కాళ్ల ఎంఈవో–2గా వేండ్ర వెంకటేశ్వరరావు


వెంకటేశ్వరావును అభినందిస్తున్న ఉపాధ్యాయ సంఘం నాయకులు

కాళ్ల: భీమవరం మండల విద్యాశాఖ అధికారి–2 గా పని చేస్తున్న వేండ్ర వెంకటేశ్వరరావుకు కాళ్ల మండల ఎంఈవో–2గా పూర్తి అదనపు బాధ్యతలు అప్పగిస్తూ ఉత్తర్వులు జారీ చేశారు. దీంతో కాళ్ల మండల విద్యాశాఖ కార్యాలయంలో గురువారం బాధ్యతలు స్వీకరించారు. కార్యక్రమంలో కార్యాలయ సిబ్బంది, ఉపాధ్యాయ సంఘ నాయకులు స్వామి, శంకర్, కిషోర్, సాయివర్మ, పాపారావు, గణేష్ మురళి, తదితరులు పాల్గొన్నారు.

రంగసాయికి ఉత్తమ సేవా అవార్డు


ఉత్తమ సేవా అవార్డు అందుకుంటున్న రంగసాయి

భీమవరం: సార్వత్రిక ఎన్నికల స్వీప్ యాక్టివిటీస్ జిల్లా బ్రాండ్ అంబాసిడర్‌గా సేవలు అందించిన చెరుకువాడ రంగసాయికి జిల్లా ఎన్నికల ప్రభుత్వ నోడల్ అధికారి కేసీహెచ్ అప్పారావు ఉత్తమసేవ అవార్డు అందించారు. గురువారం కలెక్టరేట్‌లో అవార్డు నందించి మాట్లాడుతూ ఎలక్షన్ కమీషన్ ఎన్నికల్లో ప్రతి ఒక్క ఓటరు ఓటు హక్కును వినియోగించుకోవాలనే ఉద్దేశ్యంతో స్వీప్ యాక్టివిటీస్‌ను ఏర్పాటు చేశారని ఇందులో భాగంగా రంగసాయిని స్వీప్ యాక్టివిటీస్ బ్రాండ్ అంబాసిడర్‌గా అప్పటి కలెక్టర్ సుమిత్ కుమార్ నియమించారన్నారు. రంగసాయి ఓటు నమోదు కార్యక్రమంలో విశేష సేవలందించడంతో ఉత్తమసేవా అవార్డు లభించిందన్నారు. లయన్స్ క్లబ్ ఉపాధ్యక్షుడు నరహరిశెట్టి కృష్ణ, తదితరులు పాల్గొన్నారు.

కొల్లాబత్తుల సేవలు అభినందనీయం


మహంకాళీని సత్కరిస్తున్న మున్సిపల్ వర్కర్స్ యూనియన్ నాయకులు

భీమవరం: మునిసిపల్ శానిటరీ ఇన్‌స్పెక్టర్‌గా కొల్లాబత్తుల మహంకాళీ అందించిన సేవలు ప్రశంసనీయమని మునిసిపల్ వర్కర్స్‌యూనియన్ గౌరవాధ్యక్షుడు చెల్లబోయిన రంగారావు అన్నారు. మహంకాళీ పదవీ విరమణ సందర్భంగా గురువారం యూనియన్ ఆధ్వర్యంలో ఘనంగా సత్కరించారు. ఈసందర్భంగా రంగారావు మాట్లాడుతూ కరోనా సమయంలో సైతం మహంకాళీ విషయమైన సేవలందించారని కొనియాడారు. ఈ కార్యక్రమంలో బంగారు ఆదినారాయణ, నీలపు శివప్రసాద్, నీలపు జగన్, రెల్లి రాము తదితరులు పాల్గొన్నారు.

మావుళ్లమ్మకు ఆషాఢం సారె


మావుళ్లమ్మకు ఆషాఢం సారె సమర్పిస్తున్న దృశ్యం

భీమవరం: భీమవరం మోటార్ సైకిల్ మెకానిక్స్ వెల్ఫేర్ అసోసియేషన్ ఆధ్వర్యంలో మావుళ్లమ్మకు గురువారం ఆషాఢ మాస సారె సమర్పించారు. వివిధ రకాల పండ్లు ,స్వీట్లు, సుగ్రంధ ద్రవ్యాలతో ఊరేగింపుగా వచ్చి అమ్మవారికి సారె సమర్పించారు. ఆలయ ప్రధాన అర్చకుడు మద్దిరాల మల్లికార్జునశర్మ ప్రత్యేక పూజలు నిర్వహించి అమ్మవారికి సారె సమర్పించి భక్తులకు పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో అసోసియేషన్ గౌరవాధ్యక్షుడు ఈమని చంద్రమౌళి, అధ్యక్షుడు బందెల హనుమంతరావు, ప్రధాన కార్యదర్శి ముమ్మన విజయకుమార్, కోశాధికారి బురిడి సత్య వరప్రసాద్, ఉపాధ్యక్షుడు తోట కిరణ్‌కుమార్, గాదం వీరభద్రరావు, గెద్ద రామారావు, పటాన్ల చిట్టిబాబు, సిరియాల నాగేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.

నేడు విద్యుత్ సరఫరాకు అంతరాయం

భీమవరం: మండలంలోని డి వన్ పరిధిలోని 11కేవీ నరసయ్య అగ్రహారం ఫీడర్ పరిధిలోని చెట్ల కొమ్మలు తొలగిస్తున్న కారణంగా శుక్రవారం ఉదయం 7 గంటల నుంచి మధ్యాహ్నం ఒంటిగంట వరకు విద్యుత్‌సరఫరా నిలిపివేస్తున్నట్లు విద్యుత్‌శాఖ ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్ పీర్ అహ్మద్‌ఖాన్ తెలిపారు. నరసయ్య అగ్రహారం, కుముదవల్లి రోడ్, సబ్ రిజిస్టర్ కార్యాలయం ప్రాంతాలకు విద్యుత్ సరఫరా నిలిపి వేస్తామని వినియోగదారులు సహకరించాలని ఆయన కోరారు.

విద్యార్థులకు పుస్తకాల పంపిణీ


విద్యార్థినికి పుస్తకాలు అందజేస్తున్న ఎమ్మెల్యే రామాంజనేయులు

భీమవరం: ప్రభుత్వం అందజేస్తున్న సౌకర్యాలను విద్యార్థులు సద్వినియోగం చేసుకుని ఉన్నతవిద్యను అభ్యసించాలని ఎమ్మెల్యే పులపర్తి రామాంజనేయులు అన్నారు. భీమవరంలోని జీవీఆర్ జూనియర్ (కస్తూర్బా) కళాశాలలోని విద్యార్థులకు ప్రభుత్వం పంపిణీ చేసిన పాఠ్య పుస్తకాలను ఆయన గురువారం అందజేశారు. విద్యకు పెద్దపీట వేస్తూ ఎన్డీయే నిర్ణయం తీసుకుందన్నారు. ప్రభుత్వ జూనియర్ కళాశాలల్లో చదువుకునే విద్యార్థులకు గతంలో పాఠ్యపుస్తకాలు లేకపోవడంతో పరీక్షల ఫలితాల్లో వెనుకబడ్డారన్నారు. మంత్రి నారా లోకేశ్ ఆలోచనతో ప్రభుత్వ పాఠశాలల విద్యార్థులకు పాఠ్య పుస్తకాలు ఉచితంగా అందిస్తున్నామన్నారు. విద్యార్థులు సద్వినియోగం చేసుకోవాని సూచించారు. ప్రిన్సిపాల్ నర్సింహమూర్తి, ఇంటర్మీడియట్ విద్యాశాఖాధికారి నాగేశ్వరరావు, చెనమల్ల చంద్రశేఖర్, వబిలిశెట్టి రామకృష్ణ, కోళ్ల నాగేశ్వరరావు, అధ్యాపకులు పాల్గొన్నారు.

ప్రకృతి వ్యవసాయంపై అవగాహన


గొల్లలకోడేరులో కోడిగుడ్డు, నిమ్మరసం ద్రావణంపై అవగాహన కల్పిస్తున్న దృశ్యం

పాలకోడేరు: మండలంలోని గొల్లలకోడేరులో ప్రకృతి వ్యవసాయ జిల్లా కో ఆర్డినేటర్ అరుణకుమారి రైతులకు కోడిగుడ్డు, నిమ్మరసం ద్రావణంపై అవగాహన కల్పించారు. కోడిగుడ్డు, నిమ్మరసం ద్రావణం తయారు చేయుటకు ఒక ఎకరాకు 2 లీటర్ల నిమ్మరసం, 12 కోడిగుడ్లు, పావు కిలో బెల్లం , గాజు సీసా కావాలన్నారు. ముందుగా గాజు సీసాలో నిమ్మరసం పోసి కోడి గుడ్లు ఒకదానిపై ఒకటి పెట్టి 12 రోజుల నుంచి 15 రోజులు ఉంచాలి. తర్వాత వడగట్టుకొని పావు కిలో బెల్లం కలుపుకొని ఎకరాకు పావు లీటర్ ద్రావణాన్ని 200 లీటర్ల నీటిలో కలుపుకొని పిచికారీ చేయాలన్నారు. వరిలో మొక్క ఎదుగుదలకు గ్రోత్ ప్రమోటర్‌గా ఉపయోగ పడుతుంది. కాయగూరల్లో పూత, పిందిరాలకుండా ఉపయోగపడుతుంది. అనంతరం కిచెన్ గార్డెన్‌ను పరిశీలించి, రైతులకు సూచనలు, సలహాలు అందించారు. మండల ఇన్‌చార్జి సీహెచ్ రవి కుమార్, ఎం.వీరేంద్ర, ఎం.వెంకటలక్ష్మి, ఎం.రమాదేవి, జానకి, మహిళా సంఘం సభ్యులు, రైతులు పాల్గొన్నారు.

తల్లిపాల వారోత్సవాల ర్యాలీ


ర్యాలీ నిర్వహిస్తున్న వైద్యులు, అధికారులు


గొల్లవానితిప్ప గ్రామంలో తల్లిపాలు ప్రాముఖ్యత వివరిస్తున్న వైద్యాధికారి సత్యనారాయణరాజు

కాళ్ల: పుట్టిన బిడ్డకు ఆరు నెలల వరకు తల్లిపాలు తప్పనిసరిగా పట్టాలని జిల్లా వైద్య కార్యాలయ జిల్లా ప్రాజెక్ట్ మేనేజర్ డాక్టర్ సీహెచ్ ధనలక్ష్మి తెలిపారు. తల్లి పాల వారోత్సావంలో భాగంగా కాళ్ల ప్రాథమిక ఆరోగ్య కేంద్రంనందు వైద్యాధికారి డాక్టర్ సరాబు సునీల్ అధ్యక్షతన గురువారం ర్యాలీ నిర్వహించారు. ఈర్యాలీలో భీమవరం జిల్లా వైద్యాధికారి కార్యాలయపు జిల్లా ప్రాజెక్ట్ మేనేజర్ డాక్టర్ సీహెచ్ ధనలక్ష్మి, ప్రభాకర్ ముఖ్య అతిథులుగా హాజరయ్యారు. డాక్టర్ ధనలక్ష్మి మాట్లాడుతూ బిడ్డ పుట్టినప్పటి నుంచి 6 నెలల వరకు తల్లి పాలు తప్పనిసారిగా పట్టించాలని వీటివల్ల బిడ్డ ఎదుగుదల, వ్యాధినిరోధకశక్తి పెరిగి పిల్లలు వ్యాధికి గురి కాకుండా ఉంటారని స్పష్టం చేశారు. అతిసార వ్యాధి సోకకుండా బిడ్డల్ని కాపాడొచ్చని వివరించారు. అనంతరం కాళ్ల ప్రభుత్వాసుపత్రి నూతన పీహెచ్‌సీ భవనాన్ని పరిశీలించారు. త్వర లో భవన నిర్మాణం పూర్తి చేయుటకు ఉన్నతాధికారుల దృష్టికి తీసుకెళ్తానని తెలియజేశారు. కార్యక్రమంలో డాక్టర్ డి.సునీత, వైద్య సిబ్బంది పాల్గొన్నారు.

తల్లిపాలే పిల్లలకు మొదటి టీకా

భీమవరం అర్బన్: తల్లిపాలల్లో మహత్తర శక్తి ఉందని సీడీపీవో కేటీవీ లక్ష్మీకాంతం అన్నారు. భీమవరం మండలంలోని చినఅమిరంలోని అంగన్‌వాడీ కేంద్రంలో గురువారం తల్లిపాల వారోత్సవాలను ప్రారంభించారు. ఈ సందర్భంగా సీడీపీవో లక్ష్మీకాంతం మాట్లాడుతూ నవమాసాలు మోసి బిడ్డను కనిపెంచడంలో తల్లిపాత్ర కీలకమైనదని అన్నారు. పిల్లల సక్రమమైన అభివృద్ధికి తల్లిపాలు చాలా అవసరమని అన్నారు. బిడ్డకు పౌష్టికాహారాన్ని ఇవ్వడమే కాదని తల్లిబిడ్డల బాంధవ్యాన్ని పెంచుతుందని అన్నారు. తల్లిపాలు పిల్లలకు మొదటి టీకాగా పనిచేస్తాయని అన్నారు.గర్భిణులు, బాలింతలు పాల్గొన్నారు.

రూ.30 కోట్ల పైప్‌లైన్ పరిశీలన


పైప్‌లైన్ ఓహెచ్ఎస్ఆర్‌ను పరిశీలిస్తున్న ఆర్‌డబ్ల్యూఎస్ ఎస్ఈ సత్యనారాయణ, డీఈ ధనానంద్

ఆకివీడు: మండలంలోని పరిమళ్ల లాకుల వద్ద నుంచి గోదావరి నీటిని నేరుగా సరఫరా చేసే రూ.30 కోట్ల పైప్‌లైన్ ట్రైల్ రన్‌లో గణపవరం వద్ద పైప్‌లైన్ మరమ్మతులకు గురైనట్లు ఆర్‌డబ్ల్యూఎస్ ఎస్ఈ పి.సత్యనారాయణ చెప్పారు. మండలంలోని చిన కాపవరం వద్ద పైప్‌లైన్‌కు సంబంధించి ఓహెచ్ఎస్ఆర్ ట్యాంకు వద్ద లిఫ్టింగ్ విధానాన్ని గురువారం ఆయన పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రూ.30 కోట్ల పైప్‌లైన్ మరమ్మతులకు గురైన పలుచోట్ల రిపేర్లు చేశారన్నారు. ట్రైల్ రన్‌లో గణపవరం వద్ద పైప్‌లైన్ ధ్వంసమైన విషయం గుర్తించామని, దానికి మరమ్మతులు చేపట్టిన అనంతరం మళ్లీ నీటిని వదులుతామన్నారు. చినకాపవరం వరకూ నీరు సక్రమంగా వస్తే ఇబ్బంది లేదన్నారు. నీరు లీకైతే అక్కడ మరమ్మతులు చేపట్టాల్సి వస్తుందన్నారు. అదే సమయంలో చినకాపవరం ఓహెచ్ఎస్ఆర్ నుంచి ట్రైల్ రన్ త్వరలో చేపడతామని, పైప్‌లైన్ సక్రమంగా ఉంటే కాళ్ల వరకూ నీటి సరఫరాకు ఆటంకం ఉండదన్నారు. చినకాపవరం వద్ద, ఓహెచ్ఎస్ఆర్ వద్ద నీటి పంపింగ్‌కు అమర్చిన మోటార్లు సక్రమంగానే ఉన్నాయని తెలిపారు. అనంతరం ఎస్ఈ పెదకాపవరంలోని జెడ్పీ స్కూల్‌ను సందర్శించి మంచి నీటి సౌకర్యం మెరుగు పరచేందుకు తీసుకోవలసిన చర్యలను హెచ్ఎం బందెల కాళహస్తేశ్వరుడికి వివరించారు. కార్యక్రమంలో ఆర్‌డబ్ల్యూఎస్ డీఈఈ ధనానంద్, ఇంజనీరింగ్ అసిస్టెంట్‌లు, పైప్‌లైన్ మరమ్మతుల కాంట్రాక్టర్ దాసరి వెంకట సత్యనారాయణ పాల్గొన్నారు.

సాయిబాబాకు విశేష పూజలు

కాళ్ల: మండలంలోని సీసలిలో కొలువైయున్న షిర్డీ సాయిబాబా ఆలయంలో గురువారం బాబాకు విశేష పూజలు నిర్వహించారు. గురువారం బాబాకు ప్రీతికరం కావడంతో ప్రాతఃకాల సమయంలోనే అభిషేకాలు, అర్చనలు సంప్రదాయబద్ధంగా నిర్వహించారు. ఆషాఢ మాసం ఆఖరి గురువారం కావడంతో ప్రత్యేక అలంకరణ చేసి బాబాకు నైవేద్యం సమర్పించారు. భక్తులకు ఎలాంటి అసౌకర్యం కలగకుండా ఏర్పాట్లను ట్రస్టీ బోర్డు చైర్ పర్సన్ తోరం అనంతలక్ష్మీ సత్యవతిదేవి పర్యవేక్షించారు.

ఆర్థిక సాయం అందజేత


మీనా సూర్యకుమారికి ఆర్థిక సహాయం అందజేస్తున్న దృశ్యం

భీమవరం: నేషనల్ టి 10 క్రికెట్ టోర్నమెంట్‌లో పాల్గొంటున్న చదరం మీనాసూర్యకుమారికి భీమవరం ఎడ్యుకేషన్ సొసైటీ ఆధ్వర్యంలో గురువారం రూ. 10 వేలు ఆర్థిక సహాయం అందజేశారు. ఈ సందర్భంగా సెక్రటరీ– కరెస్పాండెంట్ మెంటే రామ్ మనోహర్ మాట్లాడుతూ వీరవాసరం మండలం రాయకుదురు గ్రామానికి చెందిన మీనాసూర్యకుమారి చెవుడు మూగ వైకల్యంతో ఉన్నప్పటికి చదువులోను, క్రీడల్లోను రాణించడం అభినందనీయమన్నారు. ఈనెల 6వ తేదిన ఛండీగర్‌లో జరిగే నేషనల్ టీ 10 క్రికెట్ పోటీల్లో పాల్గొని విజయం సాధించాలన్నారు. తమ కళాశాల తరపున క్రికెట్‌లో రాణించడానికి మరింత సాయం అందజేస్తామన్నారు. ఈ కార్యక్రమంలో డిగ్రీ కళాశాల ప్రిన్సిపల్ మెంటే హరనాథ్ బాబు, వైస్ ప్రిన్సిపల్ ఇంటి రామచంద్రమూర్తి, పీజీ కోర్సెస్ డైరెక్టర్ తోట రామూర్తి సిబ్బంది పాల్గొన్నారు.

పౌష్టికాహారంపై అవగాహన కార్యక్రమం

వీరవాసరం: మహిళలంతా పౌష్టికాహారాన్ని స్వీకరిస్తూ చక్కటి ఆరోగ్యవంతమైన జీవనాన్ని సాగించాలని వీరవాసరం పిహెచ్సి వైద్యులు మొహసినా తాజ్ తెలిపారు వీరవాసరం పీహెచ్‌సీ ప్రాంగణంలో గురువారం తల్లిపాల వారోత్సవాల సందర్భంగా ప్రత్యేక అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ పుట్టిన బిడ్డకు కచ్చితంగా తల్లిపాలను అందించాలన్నారు. సీహెచ్‌వో ఎ.దేవదాసు, అంగన్‌వాడీ కార్యకర్తలు పాల్గొన్నారు.

విద్యా సామగ్రి పంపిణీ

వీరవాసరం: రాయకుదురు జిల్లా పరిషత్ హైస్కూలు ప్రాంగణంలో నిర్వహిస్తున్న ప్రభుత్వ బాలికల జూనియర్ కాలేజి నందు ఇంటర్మీడియట్ విద్యార్థినులకు వారి యొక్క చదువుకు సంబంధించిన సర్టిఫికెట్‌లను భద్రపరుచుకొనుటకు పాలకొల్లు పట్టణానికి చెందిన రిటైర్డ్ ఉపాధ్యాయుడు పేరిచర్ల ప్రతాప్‌రాజు ఫైల్స్, విద్యా సామగ్రి గురువారం అందించారు. కార్యక్రమంలో ఉపాధ్యాయులు వీరవల్లి నాగేశ్వరరావు, యు.సుబ్బరాజు, కాయల వీరాస్వామి, అంగరవేణు,పి.గురుమూర్తి, పి.పూర్ణచంద్రరావు, ఆర్.తులసీప్రదీప్ , కె.వి.డి.ప్రసాద్ యం .అరుణ తదితరులు పాల్గొన్నారు.

పింఛన్ల పంపిణీ


పింఛన్లు పంపిణీ చేస్తున్న ఎమ్మెల్యే

పాలకోడేరు: ప్రతీ నెల ఒకటో తేదీన ప్రభుత్వం పంపిణీ చేసే సామాజిక పింఛన్లను ఎమ్మెల్యే కనుమూరి రఘు రామకృష్ణరాజు గురువారం విస్సాకోడేరులో పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ 'ఎన్టీఆర్ భరోసా' పేరుతో కూటమి ప్రభుత్వం పింఛన్లను పింఛన్లను లబ్ధిదారులకు సచివాలయ సిబ్బంది ద్వారా పంపిణీ చేస్తుందన్నారు. ఇంటి వద్దకే పింఛన్లు పంపిణీ కార్యక్రమం సచివాలయ సిబ్బంది ద్వారా పంపిణీ చేస్తున్నామని తెలిపారు. కార్యక్రమంలో మంతెన రామరాజు, జుత్తిగ నాగరాజు పాలకోడేరు ఎంపీడీవో టి.అనూహ్య, కూటమి నాయకులు, సచివాలయ సిబ్బంది పాల్గొన్నారు.

ఉండి: సాసామాజిక పింఛన్ల పంపిణీలో భాగంగా గురువారం ఎమ్మెల్యే రఘురామకృష్ణంరాజు మండలంలో పింఛన్ల పంపిణీ కార్యక్రమాన్ని ప్రారంభించారు. ప్రజలకిచ్చిన మాట ప్రకారం అర్హులైన వారికి పింఛన్ ప్రతీ నెల 1వ తేదీన అందజేస్తున్నామన్నారు. ప్రతి నెలా పూర్తిస్థాయిలో పింఛన్లు అందరికీ అందించాలనే ఉద్దేశ్యంతో ఈ కార్యక్రమాన్ని ప్రారంభించామన్నారు. ఈ కార్యక్రమంలో గ్రామ సర్పంచ్ ముదునూరి వెంకటసోమరాజు, చేకూరి బోసురాజు, కరిమెరక నాగరాజు,పొత్తూరి వెంకటేశ్వరరాజు,అల్లూరి వెంకట్రాజు తదితరులు పాల్గొన్నారు.

అంతిమ యాత్రలో అవస్థలు


మైప శ్మశానానికి వెళ్లే రహదారి అధ్వానంగా ఉన్న దృశ్యం


మైప గ్రామంలో శవాన్ని మోకాలి లోతు బురదలో తీసుకెళ్తున్న దృశ్యం

శ్మశానానికి వెళ్లే రహదారి ఛిద్రం

పాలకోడేరు: ఇది ఆదిమ కాలం నాటి సమాజం కాదు..రకరకాల పథకాలతో కోట్లాది రూపాయల బడ్జెట్‌ను రూపొందించుకుంటున్న కాలం ఇది. 75 వసంతాలు పూర్తి చేసుకున్న స్వతంత్ర భారతంలో అమృతోత్సవాలు నిర్వహించుకుంటున్న కాలం ఇది. చంద్రయాన్‌లు, సూర్యయాన్‌లు నిర్వహించుకుంటున్న కాలం ఇది. సాంకేతిక విజ్ఞానం కొత్త పుంతలు తొక్కుతున్న వేళ కనీసం గ్రామంలోని శ్మశాన వాటికకు వెళ్లే దారి తెన్నూ లేక నానా అవస్థలు పడుతున్న దుస్థితి ఇది. పాలకోడేరు మండలంలోని మైప గ్రామంలో శ్మశానానికి వెళ్లేందుకు సరైన రహదారి లేక గ్రామస్తులు చాలా ఇబ్బంది పడుతున్నారు. దానికి తోడు గత వారం రోజులుగా కురుస్తున్న భారీ వర్షాలకు మట్టి రోడ్డు కాస్తా చిత్తడి చిత్తడిగా తయారైంది. గ్రామంలోని శీలం లక్ష్మీకాంతం అనే వృద్ధురాలు చనిపోయింది. స్మశానానికి వెళ్లే దారి అధ్వానంగా ఉండడంతో మోకాలి లోతు బురదలోంచే నానా అవస్థలు పడి తీసుకెళ్లాల్సి వచ్చిందని గ్రామస్తులు ఆవేదన చెందారు. జాతీయ ఉపాధి హామీ పథకంలో అయినా ఇక్కడ రోడ్డు వేసి చనిపోయిన వారి అంత్యక్రియలు చేసేందుకు బతికి ఉన్న మాకు విముక్తి కలిగించండి మహా ప్రభో అని గ్రామస్తులు ముక్త కంఠంతో వేడుకుంటున్నారు.

మురుగునీటి తొలగింపునకు చర్యలు

ఆకివీడు: వర్షాలకు నీట మునిగిన రోడ్ల వెంబడి కచ్చా డ్రెయిన్లు తవ్వడం ద్వారా వర్షపు నీరు బయటకు పోయేందుకు మార్గం ఏర్పడుతుందని గ్రామ కార్యదర్శి ఆనంద భూషణం చెప్పారు. మండలంలోని చినకాపవరం గ్రామంలోని పలు శివారు ప్రాంతాల్లో రోడ్లపై ముంచెత్తిన వర్షపు నీటిని బయటకు పంపించేందుకు కచ్చా డ్రెయిన్లు తవ్వకం గురువారం చేపట్టారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గ్రామంలోని అన్ని ప్రాంతాల్లో ముంపునీటిని బయటకు పంపించే చర్యలు తీసుకున్నామని చెప్పారు. శానిటేషన్ చేయిస్తున్నామన్నారు.

హెల్మెట్ వినియోగంపై అవగాహన ర్యాలీ


తణుకులో అవగాహన ర్యాలీ ప్రారంభిస్తున్న వైద్యులు, పోలీసులు

తణుకు: ఆపిల్ కాలేజీ ఆఫ్ నర్సింగ్, తణుకు పట్టణ పోలీసులు సంయుక్త ఆధ్వర్యంలో గురువారం హెల్మెట్ వినియోగంపై అవగాహన ర్యాలీ నిర్వహించారు. స్థానిక ఆపిల్ హాస్పిటల్ నుంచి ప్రారంభమైన ఈ ర్యాలీ వెంకటేశ్వర థియేటర్ వరకు కొనసాగింది. తొలుత ర్యాలీ ప్రారంభించిన ఆసుపత్రి చైర్మన్ అండ్ మేనేజింగ్ డైరెక్టర్ వి.సుందరరావు మాట్లాడుతూ ఇటీవల కాలంలో జరుగుతున్న రోడ్డు ప్రమాదాల్లో ఎక్కువ శాతం మోటారు సైకిళ్ల ప్రమాదాలు జరుగుతున్నాయని వీటిలో తలకు గాయం వల్ల జరిగే మరణాలు ఎక్కువగా ఉంటున్నాయని ఆందోళన వ్యక్తం చేశారు. ఈ క్రమంలో ప్రతి ఒక్కరు హెల్మెట్ వినియోగాన్ని అలవాటుగా మార్చుకోవాలన్నారు. ప్రముఖ న్యూరాలజిస్ట్ డాక్టర్ జి.సతీష్ మాట్లాడుతూ ద్విచక్ర వాహనదారుల్లో మార్పు రావాలంటే కఠిన చర్యలు తీసుకోవాల్సిన ఆవశ్యకత ఉందన్నారు. రాబోయే రోజుల్లో హెల్మెట్ వినియోగించని వారికి భారీగా జరిమానాలు వేసేందుకు ప్రణాళికలు సిద్ధం చేస్తున్నట్లు తణుకు పట్టణ సీఐ ఎం.నాగరాజు హెచ్చరించారు. అనంతరం పలువురు వాహనదారులకు ఆసుపత్రి యాజమాన్యం హెల్మెట్లు అందజేశారు.

బోస్‌కు సత్కారం

భీమవరం: ఇంద్ర జాలికుడు ఇందుకూరి సత్యనారాయణరాజు (మ్యాజిక్ స్టార్ బోస్) కు యూరోపియన్ రికార్డు సంస్థ (హంగేరి) నుంచి మల్టీటాలెంటెడ్ మెజీషియన్ అవార్డు పొందిన సందర్భంగా శ్రీ విజ్ఞాన వేదిక ఆధ్వర్యంలో ఉండి ఎమ్మెల్యే కనుమూరి రఘురామకృష్ణరాజు చేతుల మీదుగా అభినందన సత్కారం నిర్వహించారు. ఇంద్రజాల కళతో జైళ్లలోని ఖైదీలలో పరివర్తనకు పుస్తకం రాయడమే కాకుండా తరగతులు కూడా నిర్వహించడం అభినందనీయమన్నారు.